

తుక్కుగూడలో మాజీ మంత్రులు కేటీఆర్, సబితారెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



ఆమనగల్లులో బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు, అభిమానులు



తుక్కుగూడలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్



మైసిగండిలోని మైసమ్మ తల్లి ఆలయంలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు

# అభిమాన నేతకు నీరాజనం

- ఆమనగల్లులో కేటీఆర్‌కు బ్రహ్మరథం
- దారి పొడవునా ఉప్పొంగిన అభిమానం
- అంచనాలకు మించి హాజరైన రైతులు
- సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం
- రామన్న రాకతో బీఆర్ఎస్ క్యాడర్‌లో ఫుల్ జోష్

ఆమనగల్లు, ఫిబ్రవరి 18 : బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు అభిమానులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రైతు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని పోస్టాఫీస్ దగ్గరకు రాగానే సంప్రదాయ నృత్యంలో కళాకారులు, రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు కాబోయే సీఎం.. కాబోయే సీఎం అంటూ నినాదాలు చేస్తూ కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. ముందుగా మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ గుప్తా పుష్పగుచ్ఛం అందజేసి కేటీఆర్‌కు స్వాగతం తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గులాబీ కండువాను కేటీఆర్‌కు కప్పారు.

**అంతా గులాబీమయం**

హైదరాబాద్ –శ్రీశైలం చౌరస్తాకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావడంతో జాతీయ రహదారి గులాబీమయంగా మారింది. భారీ క్రేన్ సహాయంతో కేటీఆర్‌కు గజమాల వేశారు. అక్కడి నుంచి తన కారులోనే ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీగా ప్రభుత్వ కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. కేటీఆర్‌కు అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు. రైతు నిరసన సభకు అంచనాలకు మించి రైతులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రామన్న రాకతో బీఆర్ఎస్ కేడర్‌లో జోష్ నిండింది. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్ రజినీసాయిచంద్, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జి నాగం శశిధర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు కార్తీక్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు నేనావత్ అనురాధ, దశరథనాయక్, నర్సింహ, మాజీ ఎంపీపీ నిర్మల, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు అర్జున్‌రావు, పత్యానాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు చుక్క నిరంజన్ గౌడ్, దోనాదుల కుమార్, సయ్యద్ ఖలీల్, కొమ్ముప్రసాద్, రమేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రులకు గజమాలతో స్వాగతం

బడంగ్‌పేట : మాజీ మంత్రి కేటీఆర్‌కు గులాబీ పూలతో స్వాగతం పలికారు. ఆమనగల్లులో నిర్వహించే రైతు నిరసన దీక్షకు వెళ్తున్న కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి సబితారెడ్డిని మహేశ్వరం గేటు వద్ద బీఆర్ఎస్ శ్రేణులు భారీ క్రేన్ సహాయంతో గజమాలతో సత్కరించారు. గేటు వద్ద తెలంగాణ ఉద్యమకారుడు సిరిపురం యాదయ్య విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు తుక్కుగూడలో గులాబీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆమనగల్లు వరకు అడుగడుగునా భారీ ర్యాలీలో నీరాజనం పలుకుతూ రైతు ధర్నాకు తరలివెళ్లారు.

## మైసమ్మతల్లి సన్నిధిలో కేటీఆర్

**- అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు**

కడ్తాల్, ఫిబ్రవరి 18 : రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండిలో కొలువై ఉన్న మైసమ్మతల్లిని మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడింగ్ కేటీఆర్ దర్శించుకున్నారు. ఆమనగల్లు పట్టణంలో నిర్వహించిన రైతు దీక్షలో పాల్గొన్న ఆయన, తిరుగు ప్రయాణంలో మైసమ్మతల్లి ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకులు సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అమ్మ వారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాలువాతో సన్మానించి అమ్మ వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, కల్వకుర్తి, అచ్చంపేట, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, బాలరాజు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్, కృష్ణయ్యయాదవ్, హరిచంద్‌నాయక్, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

**కడ్తాల్‌లో ఘన స్వాగతం**

ఆమనగల్లు పట్టణంలో మంగళవారం నిర్వహించిన రైతు దీక్షలో పాల్గొనడానికి విచ్చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కడ్తాల్ మండల కేంద్రంలో ఘన స్వాగతం లభించింది. కేటీఆర్ కాన్వాయ్‌కి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గుమ్మడి కాయలు కొట్టి స్వాగతం పలికారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. స్వాగతం పలికిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌యాదవ్, బీఆర్ఎస్ కడ్తాల్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, మాజీ ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, గోపాల్, రమేశ్, చంద్రమౌళి, రైతు సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గంప శ్రీను, రాజేందర్‌యాదవ్, నర్సింహ, లాయక్‌అలీ, మహేశ్, పాండునేత, కృష్ణ, సురేశ్, జంగయ్య, సాయికుమార్, రమేశ్, కుమార్‌గౌడ్, నరేశ్, రంగయ్య, రవి, అంజి, శ్రీకాంత్, శ్రీను, పాండు, వెంకటేశ్, భీక్యా, లక్ష్మణ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యను అధిగమించాలి

- రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన వికారాబాద్ అదనపు కలెక్టర్, అధికారులు

వికారాబాద్, ఫిబ్రవరి 18 : రానున్న వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీవేశంలో సాగు, తాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం కలగకుండా సరఫరా, రైతు భరోసా, రబీ సీజన్‌కు సాగునీటి సరఫరా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలన్నారు. నిరంతరం నీటిని అందించేలా ప్రణాళిక ప్రకారం అమలు చేయాలన్నారు. రబీ సీజన్ కోసం సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారు.

**విద్యుత్ అంతరాయం లేకుండా..**

వేసవిలో వ్యవసాయానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని శాంతి కుమారి అన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారికి కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

**అధికారులతో సమీక్షించి..**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద అర్హులందరికీ పథకం అందించేలా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ కార్డుల కోసం ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే అర్హులందరికీ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారి మోహన్‌బాబు, విద్యుత్ శాఖ ఎస్ఈ లీలావతి, మిసన్ భగీరథ అధికారి చల్మారెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు హాజరయ్యారు.

# సత్వరమే పరిష్కరించాలి

- పోలీస్ స్టేషన్లలో కేసులు పెండింగ్‌లో ఉంచొద్దు
- వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి
- జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 18 : పోలీస్ స్టేషన్లలో కేసులు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ నారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం వికారాబాద్ పోలీసు కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్లలో ఎలాంటి కేసులు పెండింగ్‌లో ఉంచొదన్నారు. ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన కేసులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. యూఐ, ఎన్‌బీడబ్ల్యూఎస్, పాత పెండింగ్ కేసులు, ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్స్‌తో పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో కేసుల్లో కన్విక్షన్ శాతాన్ని పెంచాలని తెలిపారు. అధికారులు ప్రతి శనివారం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై సిబ్బందితో మాట్లాడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు జరగడానికి కారణాలు తెలుసుకుని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ టీవీల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలతో మమేకం కావాలన్నారు. డయల్ 100 కాల్స్‌పై నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. చోరీ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీవీ హనుమంత రావు, తాండూరు, పరిగి, వికారాబాద్, డీసీఆర్‌బీ డీఎస్పీలు, ఏఆర్ డీఎస్పీ. ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు తీసిన వేధింపులు

- 16 రోజుల్లో పెండ్లి.. ఆత్మహత్య చేసుకున్న యువకుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుడి తల్లి, బంధువులు

మొయినాబాద్, ఫిబ్రవరి 18 : వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు ప్పాలడ్డాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన ఎం సాయికుమార్ (32) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు కుటుంబ సభ్యులు వివాహ సంబంధం చూసి మార్చి 6న పెండ్లి చేసేందుకు ముహూర్తం పెట్టుకున్నారు. సంబంధం కుదిరిన తర్వాత పెండ్లి కూతురు, ఆమె బాబాయ్, బంధువులు సాయికుమార్‌ను వేధించడం మొదలు పెట్టారు. వారి వేధింపులకు సాయికుమార్ మానసికంగా బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో వేధింపులు భరించలేక ఈ నెల 17న సాయంత్రం 7 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వీడియో రికార్డు చేసి చనిపోతున్నట్లు బంధువులందరికీ పంపాడు. వెంటనే తల్లి, బంధువులు సాయికుమార్ కోసం వెతకడం ప్రారంభించారు. ఎంతకీ ఆచూకీ లభించలేదు. మరు రోజు ఉదయం 9.50 గంటలకు గండిపేట చౌరస్తాలో చెట్టుకు ఉరి వేసుకున్నట్లు బంధువులు యాదిలాల్, జహంగీర్ గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, సాయికుమార్‌ను భాస్కర దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందాడని వారు తెలిపారు. నా కుమారుడి చావుకు పెండ్లి కూతురు, ఆమె బాబాయ్, వారి బంధువులే కారకులని మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

- డీఆర్‌డీవో రంగారెడ్డి జిల్లా అధికారి శ్రీలత



చిత్తాపూర్‌లో నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో రంగారెడ్డి జిల్లా అధికారి శ్రీలత

మంచాల, ఫిబ్రవరి 18 : నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని డీఆర్‌డీవో రంగారెడ్డి జిల్లా అధికారి శ్రీలత సూచించారు. మండల పరిధిలోని తిప్పాయిగూడ, చిత్తాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా మొక్కల సంరక్షణకు ఉదయం, సాయంత్రం ప్రతి రోజూ నీళ్లు పోయాలన్నారు. అలాగే గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు ట్యాంకర్ సహాయంతో నీళ్లు పట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పని చేస్తున్న కూలీల సంఖ్యను పెంచాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలశంకర్, వాటర్‌షెడ్ పీవో సంధ్య, ఏపీవో వీరాంజనేయులు, టీఏ మహేశ్, శేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.